# పేదవాని పెదవి

త్రివిక్రమ్

"ఏమిటీ పిచ్చిపని!" - అంటూ మందలింపుగా చూసి, చటుక్కున పాదాలు వెనక్కి తీసుకున్నాను. 'నిర్మల' స్వచ్ఛంగా నవ్వుతూ, నా పాదాలు స్పృశించిన చేతులను కళ్ళకద్దుకుంది, మెల్లిగా నా యెదురుగా వున్న కుర్చీలో కూర్చుంది.

"నా జీవితాన్ని సంస్కరించారు, నా భవిష్యత్తుకొక బాటవేశారు. ఆ ఆనందమేయిది. నా ఆనందం అపసవ్యంగా, అనుచితంగా అవుపిస్తోందా రవిబాబు?" దీనంగా ప్రశ్నించింది, నాకేసే చూస్తూ విచలితుణ్ణయ్యాను.

"అబ్బే, అదేమీకాదు నిర్మలా! అపార్థం చేసుకోకు. నా దృష్టిలో యిటువంటివి పడవు. ఎదుటివ్యక్తి మీద మనకున్న గౌరవభావం ప్రకటించడానికి 'చరణ ధూళి'ని స్వీకరించనక్కరలేదు. ఆ భావమేదో మనసులో నిక్షిప్తమై వుంటే చాలు— అనుకుంటాను నేను."

ఆమెలో ఏదోమార్పు అగుపించింది. ఉద్వేగంతో అన్నది.

"మీకే కాదు రవిబాబూ! చాలా మందిలో యిలాంటి భావాలు ఊడలు దించుకుంటున్నాయి. పాత అంటే 'రోత' కావాలని కల్పించుకుంటున్నవ్యక్తులు కోకొల్లలుగా ఉన్నారు. 'పాత' అంటే మనం అనుభవించినదైనా, చూసేసినదైనా కావాలి. ఇవి రెండూ కానిది క్రొత్తదే! మన సంప్రదాయాలన్నీ ఒట్టి 'బోష్' అని ఏవగించుకునే ప్రబుద్ధుల్లో ఎందరు వాటిని ఆచరించి చెడును నిరోధించారు? చెప్పండి—"

"లేదు. నిజమే! ఒప్పుకుంటున్నాను. అయితే మన ఆచారాల్లో మూఢత్వం లేదని నీవనగలవా?"

"ఏ కొద్దో ఉంది ఉండొచ్చు రవిబాబూ! అంతమాత్రం చేత 'యూనివర్సల్ అప్లికేషన్' చేసి కాష్ఠంలో కలిపెయ్యటమేనా ఆధునికత? ఇపుడు మీకు పాదాభివందనం చేసాను. అయితే అది అంతరంగంలోంచి పొంగుకు వచ్చిన ఆనందాతిశయమే కాని మరోటి కాదుగదా? కానీ, అది మీకు అంతగా నచ్చకపోవటాన్కి కారణముంది. ఈ పాదాభివందనాలు, చరణధూళి శిరస్సున దాల్చటాలు పురాణేతిహాసాల్లో

చదివిన మీరు- అవన్నీ అభూత కల్పనలని విశ్వసించే మీరు, యిప్పటి రోజుల్లో వాటిని కళ్ళెదుట కనిపించే దృశ్యాలుగా భరించలేరు. అవి నశించి పోవాలనే వాదం మీది. సమాధులమీద పునాదులు నిర్మించాలన్న ఆశయం మీది. అంగీకరిస్తారు కదూ?"

నవ్వేను. నిర్మల ఎప్పుడు వచ్చినా అంతే. నన్ను 'రూట్ హెయిర్స్' వరకు కదిలించి కానీ వదలదు. ఆమెకు వెర్రి తలలు వేసే అధునాతనమంటే అగ్గిమీద గుగ్గిలం. నాకు బూజు పట్టిన సనాతన మంటే అసహ్యం. సమాజం కుళ్ళిపోవటానికి కారకులయిన సనాతన ఛాందసుల మీద [illegible] నాకు. హత్య చేయాలన్నంత కసి!

నేను ఏ 'కందుకూరి' వారి కాలంలోనో జన్మించాల్సింది. ఈ 'టెర్రరిస్ట్' భావాలతో ఏ 'సమాజోద్ధరణ సేన' పేరుతో విప్లవ సైన్యం నిర్మించి, యిల్లిల్లా దాడి చేసి- బాల వితంతువులకి పునర్వివాహాలు, కన్యాశుల్కాల కోసం కక్కుర్తిపడే వాళ్ళకి బుద్ధి వచ్చే రీతిలో బహిరంగ శిక్షలూ అమలు జరిపిస్తుండేవాడిని.

కాస్త ఆలస్యంగా నవ్వాను.

'నిర్మల' లేచి నిల్చుంది. "కొంచెం పని తొందర మీద వెళ్తున్నాను. ఆదివారం అలా వస్తారు కదూ?"

"ఏమిటి విశేషం?" నవ్వుతూ అడిగాను.

"మీరు మా యింటికి రావటమే!"

"అయితే రాను. వృథాగా నీ కాలాన్ని వెడగొట్టటం నాకిష్టం వుండదు. హాయిగా ఏమన్నా చదువుకుంటాను."

"కాదు- రావాలి! ఎదురుచూస్తాను. వెళ్ళొస్తా" అంటూ అచిరద్యుతిలా చిటికెలో మెరిసి మాయమయింది.

'నిర్మల' నిజంగా ఒక విచిత్రవ్యక్తి!

చేతిలో వున్న 'చలి నెగళ్ళు' బల్లమీద బరువుగా పడేసాను. బద్ధకం అనిపించింది. ఒళ్ళు విరుచుకుంటూ 'ఫ్రీ' గా వెనక్కి వాలాను. మస్తిష్కం నిండా వేలాది ఆలోచనలు. 'చలి నెగడు' మీద నివురు కప్పినట్లు, వేడి అందనట్లు, నరాలు చలికి బిగిసి పోతున్నట్లు, వేళ్ళు కొంకర్లు పోతున్నట్లు— భావన.

ఇలా స్తబ్దంగా వుంటే, ఒక్కోమాటు ఆ యేకాంతం నన్ను ఎక్కడికిలాక్కెళతుందో ఏమేమి ఊహాగీతాలు వినిపిస్తుందో అనూహ్యం. ఎక్కువ కాలం నాతో నేను గడపాలనే వాంఛించే వ్యక్తుల్లో నేనొకణ్ని

ఆలోచనల్ని మృష్టాన్నంలా స్వీకరించి, అత్రంగా ఆరగించే మనస్సు భుక్తాయాసంతో బాధ పడుతున్నట్లు, కప్పను మ్రింగిన పాములా మగతలో పడింది.

అంత మగతలోనూ, మసకబారిన గతంలో సంజె వెలుగు లాంటి సత్తువ లేని ఒక స్మృతిబిందువు ఎదలో ఒదిగింది

తలుపు మృదువుగా తడుతున్న సవ్వడి!

చటుక్కున లేచి కూర్చుని "ఎవరు" అన్నాను గంభీరంగా.

సమాధానంగా మళ్ళీ మృదువుగా, కోమలంగా తలుపు మీద తట్టిన ధ్వని, లయగా మువ్వజేరి గాజుల గలగల! ఆశ్చర్యంతో భృకుటి ముడివడింది, అనాలోచితంగానే అడుగు ముందుకు వేసాను.

"ఎవరు మీరు?" తలుపు తీసి ఎదురుగా ఉన్న అపరిచయస్తురాలిని ఆపాద మస్తకం పరికిస్తు ప్రశ్నించాను.

"నేను నిర్మలని, నన్ను లోపలికి రానివ్వండి ముందు. ఇట్లా గదిబయటే నిలబెట్టటం మీకు మర్యాద!" కాదు

"గదిలోనికి రానివ్వటం అంత రంటే అమర్యాద యేమో?"

"ఉశ్శ్... మీరు తప్పుకోండి, ఇప్పటికే మీ ప్రక్క గదులవాళ్ళు తినేసేలా చూస్తున్నారు." అంటూ చొరవగా లోపలికి నన్ను నెట్టుకుంటూ మరీ వచ్చింది. తెల్లబోయి చూస్తున్న నా కేసి నవ్వుతూ చూసి నేను ఆపుకుండానే తలుపులు జేరవేసింది.

'ఆడది' అంత చొరవ చూపటం నా జీవితంలో ప్రథమంగా అనుభవంలోకి వచ్చింది! కనీసం కలలో కూడ యిలాంటి సంఘటన ఊహించి వుండలేదు. ఆమె కేసి విచిత్రంగా చూసూ నిలబడ్డాను.

"కూర్చోండి, నేనేమీ వింతజంతువుని కాను. మనిషినే. కాకపోతే ఆడదాన్ని. ఆకర్షణని. సుమపరిమళాన్ని. మకరందాన్ని. అందుకే తూనీగను వెతుక్కుంటూ వచ్చాను," నవ్వుతూ తనంతటనే, నిర్మొహమాటంగా ఒక కుర్చీలో ఆసీనురాలయింది.

నా కెందుకో 'వెగటు' కలిగింది. ఆమె మాటలధోరణినిబట్టి విషయాన్ని కొంత గ్రహించాను! అది ఖరీదైన హోటలు. 'పెద్దమనుష్యుల'కి సకల సౌకర్యాలు సమకూర్చటంలో మేనేజిమెంటువారి శ్రద్ధ 'నిర్మల'వంటి పాకులాంటి అమ్మాయిల్ని పచ్చనోట్ల పందిరిలో నిర్మించే ధనికుల సంతోషాన్ని పెచ్చింపడంలోనే విశదమౌతున్నది.

'నిర్మల'కేసే చూస్తూ కూర్చున్నాను. ఆమె మొహంలో చెరగని నవ్వు. ఎందుకనోగాని ఆమె నవ్వు పాలరాయంత స్వచ్ఛంగా తోచిందినాకు. మొహం ఎంతో తేటగా, నిర్మలంగావుంది,

ఇంకా స్పష్టీకరించాలంటే - పసిపాప మొహంలా వుంది! అలాటి అమ్మాయిని ఆటబొమ్మగా ఆడుకోవటం క్రూరుడుతప్ప వేరొకరు సులభంగా చేయలేరు.

"నిర్మలా! కాస్తోకూస్తో చదువుకున్నదానిలా అగుపిస్తున్నావ్. ." నా మాట పూర్తికాలేదు—— "కూస్త ఏమిటండి? బి. యే. చదివాను." అంది కాస్త పైశ్రుతిలో నవ్వుతూ.

'షాక్'తిన్నాను - "బి. యే.?!"

"ఆశ్చర్యం అక్కర్లేదు రవిబాబూ!" - ఉలిక్కిపడ్డాను.

"రవిబాబూ?! నా పేరు నీ కెలాతెలుసు?" ఆశ్చర్యం ప్రకటించాను,

"మీరింత అమాయకులనుకోలేదు! యిది హోటలు బాబ్జీ!! మీకు గది కేటాయించేముందు 'కౌంటర్'లోని వ్యక్తి మీ వివరాలు రాసుకుంటాడు——" చిలిపిగా నవ్వుతోంది.

'షేమ్' అయినట్లు 'ఫీ'లయ్యాను. చొక్కా గుండీ నలుపుతూ ఓ క్షణం నిశ్శబ్దం పాటించాను. హఠాత్తుగా ఆమెకేసి చూస్తూ" ఇంతచదువు చదివిన దానివి యిలాంటి హేయమైన పనిచేసేందుకు అభిజాత్యం అడ్డుపడలేదా? ఆత్మహత్యా సదృశమైన యీ పని చేసేకంటే గుక్కెడు విషంత్రాగటం ఉత్తమంకాదా?" అన్నాను.

ఆమె లేచినిల్చుంది. కోపంవచ్చినట్లు ఆమె మొహమే చెబుతోంది. రక్తం

యావత్తూ మొహంలోకి చేరింది. నవ్వు ఎప్పుడో పారిపోయింది, పెదాలు స్వల్పంగా కంపించటం కనిపిస్తోంది.

నిముషందాకా ఏమీ మాట్లాడలేకపోయింది.

అంతలో తనను తాను సంగ్రహించుకొని, పేలవంగా నవ్వుతూ "క్షమించండి! నేను ఎలా ప్రవర్తించాలో మర్చిపోయాను—" గొంతు సవరించుకొంది. చేరుమాలుతో కన్నీటి పొరలను అద్దుకొంది.

మెల్లగా సమీపానికివచ్చి, తియ్యటి నవ్వుని బలవంతాన పెదవులమీద అతికించి, సోఫామీద నన్ను బాగా ఆనుకుంటూ కూర్చుంది. ఘాటయిన సువాసన అప్పుడుగానీ నన్ను పలకరించలేదు! బహుశః రుమాలులో దాగి ఉండాలి.

"ఎక్స్‌క్యూజ్‌మీడార్లింగ్! లెటజ్ హావె డ్రింక్-"అంటూ 'బజర్' నొక్కింది. నిశ్చలంగా ఆమెకేసేచూస్తూ "నీప్రయత్నాలు నిష్ప్రయోజనమని ఎంతత్వరగా గ్రహిస్తే అంతమంచిది నిర్మలా! నేనలాంటివ్యక్తినికాను. నువ్వెళ్లొచ్చును. కానీ ఒక్కమాట చదుకున్నా నన్నావ్, ఏదన్నా ఉద్యోగంచేసుకుని గౌరవంగా బ్రతుకు, నీ భవిష్యత్తుకి చాలా మంచిది, గుడ్‌బై!" గుక్కతిప్పుకోకుండా అన్నాను,

అంబుధి అంచున అణిగి పోయిన కెరటం, పునర్జన్మించి ప్రచండ వేగంతో విరుచుకు పడ్డట్లు ఆమెలో మళ్ళీ ఆగ్రహం చెలరేగింది!

"ఉద్యోగం చెయ్యనా? ఏం ఉద్యోగం చెయ్యను? నాతో చదివిన గ్రాడ్యుయేట్లు యీ హోటల్లో 'బట్లర్స్'గా ఉన్నారు! కొందరు యీ ఊళ్లో టాక్సీ నడుపుతున్నారు. ఇంకొందరు ఎంప్లాయ్‌మెంటు దేవాలయం చుట్టు ప్రదక్షిణాలు చేసి పుణ్యం మూటగట్టు కొంటున్నారు. నేను ఏమి చెయ్యగలను? ఆ పనుల్లో ఏ ఒక్కటీ నావల్ల కాదు. నేను ముందు వెనుకల నుయ్యి, గొయ్యిలతో- నాన్నగారు వదిలి వెళ్లిన అప్పులాళ్ల జలగలతో బ్రతికిన దాన్ని. అమ్మ బ్రతుకుని పక్షవాతానికి బలిపెట్టలేక, కడుపులోని నరాన్ని ఆకలిమంటలో దగ్ధంచేసే ధైర్యం లేక, ఆత్మహత్య చేసుకోగల సాహసం లేక, యీ మార్గాన్ని ఎంచుకున్నాను, నయం! భగవంతుడు స్త్రీకి యీ 'ఆధార'మన్నా యిచ్చాడు! అదికూడ లేని మగవాడి బ్రతుకు మాత్రం చాలఘోరం... ఐ రియల్లీ పిటీ హిమ్!" కసిగా అంది.

"ఎలా విచిత్రంగా ఉంది నీ సమాధానం నిర్మలా! తాడిచెట్టు ఎందుకు

ఎక్కువంటే దూడమేత కోసమన్నట్లుంది. ఉద్యోగం లభించలేదు కాబట్టి భగవంతుడిచ్చిన స్త్రీత్వాన్ని దుర్వినియోగం చేస్తూ పడుపు వృత్తి చేపట్టా నంటావా? ఎంత ఘోరమయిన అబద్ధం! ఈ విశాల ప్రపంచంలో నీకు కడుపు నింపుకోవటానికి చిన్న ఉద్యోగం దొరకటం దుర్లభ మంటే నమ్మమంటావా?"

అంతలో తలుపు తట్టిన శబ్దమైంది. "కమిన్ హారీ!" అంది నిర్మల. బట్లర్ దుస్తుల్లోఉన్నవ్యక్తి చేతిలో 'ట్రే'తో వచ్చాడు. దాంట్లో 'డ్రింక్స్-సరంజామా' వుంది! అతను లోపలికి రాగానే మళ్లీ తనే తలుపులువేసి "హారీ....కాస్త నీ గురించి విన్పించు ఈ దొరగారికి - డన్‌లప్ పరుపులమీద విశ్రమించేవారికి మనదేశంలో నిరుద్యోగులున్నారన్న నమ్మకం కలగటంలేదుట!" వ్యంగ్యంగాఅని నాకేసి చేతినిచూపింది.

'హారి' మా యిద్దరికేసి అయోమయంగా చూసాడు. అతని మొహంలో భంగిమలు విచిత్రంగా మారాయి. "సుఖంగా కాలక్షేపంచెయ్యక ఏమిటీపనికిరాని ప్రశ్నలు?" అన్నట్లు నా కేసి చూసేడు.

"హారీ! నిర్మలమాటలు నిజమేనా? అయితే నువ్వొ ఒక గ్రాడ్యుయేట్ వేనా?" ఆసక్తిగ ప్రశ్నించాను. ఓర్పుగా నిట్టూర్చి 'ట్రే'ని బల్లమీదపెట్టి చేతులు విదిలించుకున్నాడు.

సిగిరెట్టు వెలిగించుకుంటూ, నాకోటి 'ఆఫర్' చెయ్యబోయ్యేడు. వద్దన్నాను. గట్టిగా ఓదమ్ములాగి వదిలి "ఐయామ్ బి.య్యే. లిట్. విత్ షేమ్‌ఫుల్ జాబ్. మే గాడ్ సేవ్ దిస్ పూర్ యిండియా ఫ్రమ్ ఆల్ ది రిఫార్మర్స్" అన్నాడు కసిగా.

నాకు నిజంగా జాలివేసింది. "ఐ రియల్లీ పిటీ యూ హారీ! నాకు యీ విషయం యింతవరకూ తెలియదు. ఐ ప్రామిస్ టు గెట్ బోత్ ఆఫ్ యు ఎంప్లాయిడ్ యిన్ గుడ్ జాబ్స్." అన్నాను అభయం యిస్తున్నట్లు.

సిగరెట్టు నుసి ఆష్‌ట్రేలో రాలుస్తూ "నో నో మిస్టర్ జెంటిల్‌మెన్ నాకు గుమాస్తాగిరీ వొద్దు, చాకలి గాడిదలతో పోటీపడే ఆ బరువులతో నా వెన్నెముక విరిగిపోవటమూ వద్దు. నేను పేరుకి బట్లర్‌ని. కానీ బి.య్యే. అన్నసంగతి మర్చిపోవాలి తప్పదు. ఇప్పుడు తేలిగ్గా జీవితంతో ఎడ్జస్టు కాగలను. నా జీతంతో జీవితాన్ని తృప్తిగానే గడుపు తున్నాను. పైన మీవంటి పెద్దచేతులు విదిలించే 'టిప్స్' కూడా తక్కువేమీ కాదు. కానీ నాకు కడుపులో' పచ్చభాస్వరం' మండుతున్నట్లు బాధ కలిగించేది 'నిర్మల' బ్రతుకే. అందం ఉన్నంత వరకూ ఆమెకు ఆదరణ! ఆరో

గ్యాంక్షిణించి అందం అడుగంటిన తర్వాత 'కరుణశ్రీ' వివరించిన 'పీదపూలు' బాధ యీమె గాధకి అద్దం పడుతుంది.

మీరేమన్నా నిజంగా చేయదలిస్తే 'నిర్మల' కి చేయండి. అదేనాకుఆనందం

-'నిర్మల' నేత్రాలు సజలాలైనాయి. గద్గదంగా "హ-రీ" అంది ఏడుపు మ్రింగలేక. నా మనసు ఆర్ద్రమైంది.

"చేస్తాను-తప్పకుండా ఆమె జీవితాన్ని సంస్కరిస్తాను. కానీ, యీక్ష ణంనుండి యీ పాప కూపంనుండీ బైటకి గెంతితేనే!"-అన్నాను ఆవేశంగా.

గెంతేది సురక్షితమైన ప్రదేశం మీదకే అన్న భరోసా లభిస్తున్నప్పుడు సం శయమెందుకుంటుంది సార్?" అన్నాడు సిగరెట్టు ఆష్ట్రేలో నులుముతూ 'హరి'.

ఆట్టా తారసిల్లింది 'నిర్మల' నాకు!

నాకున్న పలుకుబడితో ఆమెకోచిన్న ఫాక్టరీలో ఆడకూలీల మీద 'సూపర్ వైజర్' పని యిప్పించాను. జీతం రెండొందలయాభై. సంవత్సరాంతాన లాభా ల్లో మూడోవంతు పనివాళ్ళకి 'బోనసు'గా ముట్టుతుంది.

ఆమె పనల్లా కూలీలను ప్రోత్సహించి పని బాగా చేయించటం, నెలజీతా లు పంపిణీ చేయటం, కూలీలు యజమానులకు విన్నవించు కోదల్చిన విషయాలు వాళ్ళ తరుపున మాట్లాడటం.

అచిర కాలంలోనే ఆమెకు, కార్మికులకూ సాన్నిహిత్యం ఏర్పడింది. ఆమె అంటే యజమానులకు సదభిప్రాయం ఏర్పడింది. ఆమె జీతంలో మరికొంత అధి కంచేసి తమ మంచితనాన్ని వెల్లడించుకున్నారు యాజమాన్యంవారు.

'ఫ్యాక్టరీ' నుండీ తిరిగివచ్చిన తర్వాత ఊరికే కూర్చోదు నిర్మల, పిల్లలకి చదువు చెబుతుంటుంది. తరచుగా నన్ను కలుసుకునేందుకు వస్తుంటుంది. ఏదో సంభాషణ ఆరంభిస్తుంది. అంతలోనే ఆవేశానికి లొంగిపోతుంది. భావోద్వేగం ఆమెలో చాలఎక్కువ. స్వభావం మళ్ళీ నవనీతమే.

ఈ రోజు 'నిర్మల' నావద్దకొచ్చి పాదాభి వందనం చేయటంలో ఒకానొక

విశేషముంది. ఆమె జీవితం 'మలుపు' తిరిగిన రోజు యిదే! అదొక పర్వదినంగా ఎంచుకుంటుందామె.

ఆమె కంటికి నేనొక దేవపురుషుణ్ణట! నా పదధూళిని స్పర్శిస్తుంటేనే ఒక అనిర్వచనీయమయిన ఆనందమట. నిజమేనా?!-అని ప్రశ్నించుకుని, అంతలోనే "ఛఛ" అనుకుని నేనే మందలించుకుంటాను.

'నిర్మల'కి పిచ్చిపట్టిందని, ఆ ప్రేలాపన అంతా నిజమేనన్న భ్రమలో [illegible] పోవటమేమిటి? నాకు తోచినదేదో నేను చేసాను. శక్తి ఉంది కాబట్టి సాయం చేసాను. దీపం ఉంది కాబట్టి చీకటిని చీల్చాను! అందులో నా ప్రత్యేకత ఏముంది?

నాకు అమితాశ్చర్యం కల్గించేదేమిటంటే-ఒకప్పుడు సంఘాన్ని [illegible] ఆహ్వానించిన నిర్మల, లోకం మీద [illegible] కక్ష సాధించదలచిన నిర్మల-నేడు

నేను సనాతన ద్వేషిని. ఆమె సనాతన ప్రేమి!

ఇద్దరం-ఉత్తర దక్షిణ ధృవాల వంటి వాళ్లము. అయినా భావాలు భిన్నత్వంలో ఏకత్వంగా ఉంటాయి. అదే లేకపోతే-యీ ధృవాల కలయిక అసాధ్యమయ్యేది! 'నిర్మల' ఆహ్వానాన్ని మన్నించి, ఆదివారం వెళ్లాను!!

* * * *

"బాబూ! నిర్మలమ్మగారు ఆసుపత్రిలో ఉంటారు, తమన్ని వెంటనే రమ్మన్నారు." వగరుస్తూ ఒక్కొక్కమాటా విన్నవించాడా కార్మికుడు.

చేతిలో ఉన్న బాపిరాజు 'తుఫాను' అప్రయత్నంగా జారిపడింది. "ఆస్పత్రిలో ఉందా? ఎందుకని? ఏమైంది? ఎప్పుడు జేర్పించారు? తొందరగా చెప్పు." అంటూ వాడిని ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేసిపారేసాను.

"బాబూ! అయన్నీ సెప్పాలంటే శానా సేపవుద్ది. తమరు ఎంటనే ఎల్లాలి. అమ్మగోరు శానా పెమాదంలో ఉండాది." బావి తీర్చుకుని గద్గదంగా, గుడ్లనీరు కుక్కుకుంటూ [illegible] చేసాడు.

ఆదరా, బాదరా సిద్ధమై-అనుమానాల మీద ఆస్పత్రికి వెళ్లాను. అది గవర్నమెంటు ఆస్పత్రి. అందులో డాక్టర్లు నాకు బాగా పరిచయస్తులు,

'నిర్మల' ఎక్కడుందో తెల్సుకోనటం కష్టమనిపించలేదు. ఆ వార్డు దగ్గర ఆడ కూలీలు గుమికూడి ఉన్నారు. కొందరు మొగవాళ్లుకూడ ఉన్నారు.

ఆత్రుతంగా అడుగు లోపలికి వేశాను. కట్టెదుట దృశ్యం కళ్లు చెదర గొట్టింది. 'సిలైన్' సీసాలోంచి ద్రవం 'నిర్మల' రక్తనాళాల్లోకి ప్రవహిస్తోంది. గుండెలదాకా దుప్పటి అచ్ఛాదితమై ఉంది.

మొహం మీద ఏవో గాయాలు! కపోలాలు కమిలి పోయి ఉన్నాయి - విషయం ఏమీ అర్థంకాలేదు.... పెదవులకేసి చూసి 'షాక్' తిన్నాను ఎందుకిలా వాచి ఉన్నాయ్? ఏమిటీ రక్తం....?! అదేదో గాయంలా ఉంది. నెత్తురు గడ్డకట్టిన ఛాయలు....జుట్టు 'తుఫాను' భీభత్సానికి చెకావికలయిన 'మాగాణి' పంటలా అస్తవ్యస్తంగా ఉంది. కళ్లు ఉబ్బిఉన్నాయి.

మొహం-ఒకనాడు నేను పాలరాతి స్వచ్ఛతనీ, పసిపాప అమాయకత్వాన్నీ చూసి ముగ్ధి పోయిన మొహం, అతి భీకరంగా మృత్యువుకి 'నాట్యవేదిక'లా ఉంది.

ఏమిటిదంతా?

ఏ దుష్టశక్తి ప్రభావ మీ ఘోరదృశ్యం?

నిర్మలా!....నిర్మలా....నేను....రవిబాబుని, కళ్లుతెరు....మాట్లాడు,ఏమైందో చెప్పు....ఆవేదనా స్వరంతో మీదకి వంగి మెల్లగా అడిగేను.

ఆమెలో స్వల్పంగా కదలిక. ఇనుప గోడను చీల్చుతున్నట్లు బలవంతాన కనురెప్పలు చీల్చుకుంది. నిర్నిమేషంగా నా మొహంలోకి చూసింది. వచ్చారా....రవిబాబూ?....అదృష్టవంతురాలిని. ఆఖరు క్షణాల్లో మిమ్మల్ని చూడగలిగాను. మీ స్వరం నన్నే లోకాన్నుంచి పట్టిలాక్కొచ్చింది' "ఎండిపోతున్న నాలుకని తడుపుకుని మళ్ళీ మాట్లాడింది.

"నాకేదో అయిందని బాధపడుతున్నారుకదూ మీరు? నిజానికి నాకు జరిగిన దానికన్నా ఘోరం ఆ తలుపుకవతల ఉన్న కార్మికులకి జరిగింది. ఆ కటిక పేదల కడుపులకి జరిగింది. మీకు సూచనగా చెప్పాను-రవిబాబూ! వాటాలు పంచుకోవటంలో మా ఫాక్టరీ ఒక కిరాతకుడి చేతికి వచ్చిందని, అతను చేయగల్గిన ఘోరాలన్నీ చేసాడు . ప్రమాదంలో చేతిని పోగొట్టుకున్న 'పడతి'ని నిర్దయగా తొలగించాడు. ప్రసూతితో కదలలేని స్థితిలో పచ్చిబాలింతరాలై ఉన్న తరుణంలో పనికిరాలేదన్న నేరంతో మరోస్త్రీని బర్తరఫ్ చేసాడు, కంటికి నచ్చిన ఆడ కూలీల జీవితాలతో

ఆడుకున్నాడు. చివరికి గంజి దొరకని రోజుల్లో 'బోనసు' పద్ధతి తీసేసి జీతాలు తెగ్గోయడంతో ఎదురు తిరగక తప్పలేదు.

నా నాయకత్వాన్ని గర్హించాడు. నా అంతం చూస్తానన్నాడు. నిన్న పది మంది రాక్షసులకి నా సర్వస్వం ఆహారమైంది! పరిసరాల నుండి, రాక్షస ప్రవృత్తితో మనిషి తోలుకప్పుకున్న మృగాలనుండీ, రక్షణలేని జీవితాలు మావి రవిబాబూ! మా పేదవాళ్ళకోపాలు పెదవులకే కాదు ప్రాణాలకే చేటు.

ఈ దేశంలో 'అగ్నివర్షం' కురవాలి. అవని మీద పాపాల నెలవులు భస్మం కావాలి. అప్పుడే శాంతి. అప్పుడే మరో సూర్యుడుదయిస్తాడు. "లావా" ప్రవాహంలాగ సాగిన 'ఝరి' ఆగిపోయింది.

ఆమెలోని జ్యోతి ఆరిపోయింది.

ఆ 'మృతజీవి'కి చేతులు జోడించాను. బయట కూలీలకు వర్తమానం అందిన సంకేతంగా శోకాల ఘోష, ఆమె పెదవులమీద గడ్డకట్టిన నెత్తురు, 'రంగుల చిత్రం'లా ఆ 'పేదపెదవి'ని కౌగలించుకుంది. ఆ ఎరుపులో ఎన్నో సందేశాల రంగులు.

నర్సు ఆమె మొహం దాకా తెల్లగుడ్డ కప్పింది.